## క్లుప్తంగా

### గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



అలంకరణలో గ్రామ దేవత గంగమ్మ తల్లి

**కారంచేడు:** గ్రామ దేవత గంగమ్మతల్లికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గంగమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మొదటి మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి ఆలక కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ఆవుల రాజేష్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని నలు మూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమ్మవారికి నైవేద్యములు, పొంగళ్లు సమర్పించారు. భక్తజన మండలి ఆధ్వర్యంలో లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

### పేద మహిళకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ అధ్యక్షుడు

**అద్దంకి:** అనారోగ్యంతో వైద్య ఖర్చులకు డబ్బు లేక ఇబ్బందులు పడుతున్న పేద మహిళ పద్మకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆమెకు సాయాన్ని తాళ్లూరి బాబూరావు సౌజన్యంతో సోమవారం పట్టణంలోని చిన్ని మురళీ కృష్ణ కార్యాలయంలో అందజేశారు. అదే విధంగా పసుమర్తి యల్లమంద అనే పేద వ్యక్తికి బస్తా బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, నర్రా శ్రీలక్ష్మి రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

### సెయింట్ ఆన్స్‌లో అంతర్జాతీయ సదస్సు

**వేటపాలెం:** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు సోమవారంతో ముగిశాయని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. వర్చువల్‌గా నిర్వహించిన సదస్సులో వివిధ దేశాల యూనివర్సిటీల నుంచి 110 పరిశోధాన పత్రాలు సమర్పించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలరావు తెలిపారు. నేటి అధునిక ప్రపంచంలో గ్లోబల్ డిజిటలైజేషన్ వైపు పరుగులు తీస్తోందన్నారు. కార్యక్రమంలో ఎం శ్రీదేవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### ఆధునిక పద్ధతితో అధిక లాభాలు




మాట్లాడుతున్న డేవిడ్

**మేదరమెట్ల:** ఉద్యాన పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలభించి అధిక లాభాలు పొందవచ్చని పీ గుడిపాడు మాజీ సర్పంచ్ రావూరి డేవిడ్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ ఎస్టీ రైతులకు గుడిపాడు గ్రామంలో బిందు సేద్యం, మల్చింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మట్లాడుతూ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ఉపయోగించుకుని రైతు ఎదగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం గ్రామ సంఘ అధ్యక్షురాలు జంగా ఆరోగ్యం, సునిత గ్రామ మహిళా రైతులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కుముదిని

**పర్చూరు:** విద్యార్థులు చిన్నవయస్సు నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం కుముదిని అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ ఎస్సీ గరల్స్ హాస్టల్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరల్డ్ డే ఆఫ్ సోషల్ జస్టిస్ (ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం) సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ అనంతలక్ష్మి, ప్రిన్సిపాల్ ఖాదర్ పాల్గొన్నారు.

# వరి చేను నవ్వింది



కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో మిషన్ ద్వారా ధాన్యం సేకరణ



ట్రాక్టర్‌లో ధాన్యాన్ని తీసుకొస్తున్న కూలీలు

- ఎకరానికి 36–42 బస్తాల దిగుబడి
- ఆశాజనకంగా ఉన్న వరి
- ఆనందంలో అన్నదాతలు
- ప్రభుత్వ గిట్టబాటు ధర చూసి రేట్లు పెంచిన మిల్లర్లు

**కారంచేడు:** ఏటికేడు రైతన్నల మోముల్లో చిరునవ్వు తొలకడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యపు గింజపై రైతన్న పేరు ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతన్నలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కాలర్ ఎగిరేలా చేసింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన మొత్తం రైతు సంక్షేమానికే అన్నట్లుగా ఉందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత అన్నదాతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సకాలంలో వర్షాలు, కాలువల్లో సాగు నీరు, అనుకూల వాతావరణంతో అన్నదాతల పంట పండిందనే చెప్పాలి. ఈ ఏడాది వరి ధాన్యం ఎకరానికి 36–42 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయని సంతోషపడుతున్నారు. కోతల సమయంలోనే పంటను కొనుగోలుదారులు పొలం మీదనే ధాన్యం బస్తా (75 కేజీలు)ను రూ.1460 కొనుగోలు చేస్తున్నారు.

**ఊహించని దిగుబడులు..**

గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది రబీలో వరి ధాన్యం దిగుబడులు ఊహించని విధంగా ఉన్నాయి. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద కారంచేడు, చీరాల, పర్చూరు, చినగంజాం మండలాల పరిధిలో సుమారు లక్ష ఎకరాల వరి సాగు ఉంది. దీనికి తోడు నాగార్జునసాగర్ ఆయకట్టు కింద మరో 20 వేల ఎకరాల వరకు ఈ మండలాల్లో సాగు ఉంది. గతంలో 92 రకం వరి వంగడాలను వినియోగించేవారు. అయితే ఈ రకం వరి వంగడాలు అధిక వర్షాలు, వరదల సమయంలో పూర్తిగా నష్టపోవాల్సి వస్తుండటంతో పాటు, ఆశించిన రీతిలో ధరలు రాకపోవడం వలన ఈ ప్రాంత రైతులు అధికంగా 2270 రకం వరి వంగడాలను వినియోగిస్తున్నారు. ఈ రకం వంగడాలతో ఈ ఏడాది ఎకరానికి సుమారు 36 బస్తాల నుంచి 42 బస్తాలు కొంత మందికి 45 బస్తాల వరకు కూడా దిగుబడులు వచ్చాయి. గతంలో కేవలం 25 బస్తాల నుంచి 32 లేదా 35 బస్తాల వరకు మాత్రమే వచ్చేవి.

**గిట్టుధరతో పొలాల వద్దనే అమ్మకాలు..**

తెలంగాణ ప్రాంత మిల్లర్లు ఈ ఏడాది ఇక్కడ పండించే 2270 రకం ధాన్యం కావాలని మరీ ఇక్కడకు వచ్చి పొలాల వద్దనే కొనుగోళ్ల చేపట్టారు. గతంలో పొలాల వద్ద బస్తా (75 కేజీలు) గోతం, ఎగుమతులు (తోలకం ఖర్చు)లతో కలిపి రూ.1200–1300ల వరకు ఉంటే ఈ ఏడాది మొత్తం ఖర్చులు మిల్లర్లే భరించి బస్తాను రూ 1460 కొనుగోలు చేస్తున్నారు. గోతం, తోలకం ఖర్చులతో కలిపితే రూ.1580 ధర వచ్చినట్లు. దీంతో అన్నదాతలు 30–50 శాతం మంది రైతులు నిల్వలకు అవకాశం లేకుండానే పొలాల వద్దనే అమ్మకాలు చేసుకుంటున్నారు. సొంతంగా సాగు చేసుకొనే రైతుల కంటే ఈ ఏడాది కౌలు రైతులకు మేలుకరంగా ఉందని పలువురు రైతులు చెప్తున్నారు. పాత ధాన్యం బస్తా రూ.2300 వరకు ధరలు పలుకుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా మంచి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటోంది.

| మండలం | సాగు చేసిన ఎకరాలు (రబీలో) |
|---|---|
| కారంచేడు | 25000 |
| చీరాల | 25000 |
| పర్చూరు | 10000 |
| వేటపాలెం | 12500 |
| చినగంజాం | 15000 |
| నాగులుప్పలపాడు | 12500 |

**ధాన్యం దిగుబడులు బాగున్నాయి..**

ఈ ఏడాది అనుకూల వాతావరణం, సకాలంలో వర్షాలు సాగునీరు అందుబాటులో ఉండటంతో మాగాణి పొలాలు బాగున్నాయి. అనుకున్నదాని కంటే ఎక్కువగానే దిగుబడులు వచ్చాయి. గతంలో నష్టాలు చూసిన అన్నదాతలు ఏడాది లాభాలు చూస్తారు.

– యార్లగడ్డ శ్రీనివాసరావు, రైతు, కారంచేడు

**గిట్టుబాటు ధరతో సంతోషంగా ఉంది..**

ఈ ఏడాది కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సాగు చేసిన వరి చేలల్లో మంచి దిగుబడులు వచ్చాయి. దీంతో అన్నదాతలు ఆనందంగానే ఉన్నారు. మిల్లర్లు కూడా పొలం వద్దనే మంచి గిట్టు బాటు ధరలు ఇచ్చి తీసుకెళ్తున్నారు. శ్రమం లేకుండా పొలం వద్దనే గోతం, తోలకం ఖర్చులు వాళ్లే భరించి తీసుకువెళ్తున్నారు.

– ఎస్ వెంకటేశ్వరరావు, కౌలురైతు, కుంకలమర్రు

## ఉగాదిలోపు లక్ష్యాలు చేరుకోవాలి

**అద్దంకి:** ఉగాది లోపు హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ దాశరథిశర్మ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు చెప్పారు. స్థానిక సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సోమవారం ఎంపీడీవో సాంబశివరావు ఆధ్వర్యంలో ఇంజనిరింగ్ అసిస్టెంట్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలో 451 గృహాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రమణనాయక్, ఏపీఎం మస్తాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**బల్లికురవ:** ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా ఇళ్లను తక్షణమే నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో పీఆర్ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ వీ. సీతామహాలక్ష్మి, ఏపీఎం ఈ. సురేంద్ర బాబు పాల్గొని మాట్లాడారు.

## సంక్షేమ పథకాలు అభినందనీయం



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న గోవిందస్వామి

**చినగంజాం:** సామాజిక న్యాయం అమలులో బాగంగా స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను భారత్ నిర్మాణ్ వలంటీర్ ఈ గోవింద స్వామి అభినందించారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం స్థానిక వాల్మీకి వృద్ధుల సేవా సంఘం నందు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు ఒకసారి ఇటు చూడరూ..



మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుకున్న శ్మశానం

- జయంతిపేట శ్మశాన వాటికలోకి మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



ప్రహరీ లేకపోవడంతో గృహాల పక్కనే సమాధులు

**చీరాల రూరల్:** మనిషి మరణిస్తే ఆఖరి మజిలీ శ్మశానమే దిక్కు. మరణించిన వారిని హిందూ, ముస్లిం, క్రిష్టియన్‌ల సంప్రదాయాల ప్రకారం ఖననం చేస్తారు. ఎంతో ప్రశాంత వాతావరణంలో ఉండాల్సిన శ్మశాన వాటికలు ముళ్ల తుప్పలతో చెత్తా చెదారాలతో నిండిపోయి మురికికూపాలుగా అపరిశుభ్రతకు కేరాఫ్‌లుగా నిలుస్తున్నాయి. అటువంటి శ్మశాన వాటిక పట్టణంలోని జయంతిపేట శివారు ప్రాంతంలో ఉండడం విశేషం. చీరాలలోని పేరాల జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మ పేటలోని కొంత భాగం, శాంతి నగర్, ఉజిలిపేట, జవహర్ నగర్, పాలేటి నగర్, హరిప్రసాద్ నగర్ వంటి ప్రాంతాలకు జయంతిపేట శివారు ప్రాంతంలోని క్రిష్టియన్ శ్మశాన వాటిక ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఎవరు మృతి చెందినా ఆయా మృత దేహాలను ఇక్కడే ఖననం చేసి సమాధి చేస్తారు. అయితే మృతి చెందిన వారిని ఈ శ్మశానవాటికలోకి తీసుకురావాలంటే ఎంతో ప్రయాసతో కూడిన పని అవుతోంది. చుట్టూ ఇళ్ల మధ్యలో సమాధులు ఉండడం సమాధులతో శ్మశానం పూర్తిగా నిండిపోయి ఉంది. ఉన్న కొద్దిపాటి స్థలంలో కూడా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయి పాములకు, పందులకు ఆవాసాలుగా మారాయి. ఉన్న మరికొద్దిపాటి స్థలంలోకి ఇళ్లల్లో నుంచి డ్రైనేజి కాలువ ద్వారా వచ్చే మురుగునీటిని శ్మశానంలోకి వదులుతున్నారు.

**సమాధుల్లోకి మురికినీరు..**

ఇళ్లల్లో నుంచి డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగు నీటిని కాలువలో ప్రవహింపజేసి ఊరి బయటకు తరలించే విధంగా కాలువ ఉన్నప్పటికీ కొందరు తమ స్వార్థం కోసం డ్రైనేజి కాలువను పగలగొట్టి మురుగునీటిని శ్మశానంలోకి వదులుతున్నారు. దీంతో సమాధుల వద్ద నీరు నిల్వ ఉండడంతో బీటలువారి కుంగిపోతున్నాయి. పైసాపైసా కూడపెట్టి ఎంతో ఇష్టంగా తమవారి సమాధులు కళ్లముందే కూలిపోతుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. దానికి తోడు మున్సిపాలిటీ వారు ఇళ్లనుంచి సేకరించిన చెత్తను శ్మశానంలో వేస్తున్నారు. మురుగునీరు చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

## శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

**అద్దంకి:** శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం శతభిషం నక్షత్రం పాఢ్యమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

### ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్ బహూకరణ

**పర్చూరు:** మండలంలోని నాగులపాలెం బదిరుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన రైస్ కుక్కర్‌ను కొండబాలవారిపాలేనికి చెందిన దాత తోకల వినయ్‌కుమార్ తన తాత వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం అందించారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.15 వేల విలువైన కుక్కర్ బహూకరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఆంజనేయులు, హెచ్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

## ప్రోత్సాహక బహుమతులు పంపిణీ

**చీరాల అర్బన్:** చీరాల మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు సోమవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. గ్రామానికి చెందిన చేగూడి శ్రీరాములు, విజయమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకట సుబ్బయ్య, సాల్మన్‌రాజు, గౌతమ్‌బుద్ధ, అరుణ్‌చంద్‌లు రూ.2 లక్షలను ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. ఫిక్సిడ్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీని ప్రతి ఏడాది పదోతరగతి విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్నారు. 2021–22 సంవత్సరానికి ఫణిదెపు జయశ్రీ, చేవూరి వీరమ్మ, దేవరపల్లి రూపలకు రూ.5 వేలు చొప్పున బహుమతులు అందించారు. అలానే రిటైర్డు బ్యాంకు మేనేజర్ జి.దేవేంద్రనాథం వ్యక్తిగతంగా రూ.1500 అందించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.నాగేశ్వరరావు, హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, నేతాజీ యూనియన్ ఫౌండర్ ఎస్.వి.మోహనరావు, అధ్యక్షులు ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతులు అందిస్తున్న దాతలు

## ■ సీఎం జగన్‌ను కలిసిన వెంకటేష్



చీరాల: నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంను వైఎస్సార్‌సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

**అద్దంకి:** ఒంగోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం శాసన సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి చేయాల్సిన కృషి తన వంతు ప్రచారం చేస్తానని రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల శాసన సభ్యులు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## గృహసారథులు, కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

**బల్లికురవ:** వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చెయ్యాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండలంలోని 21 గ్రామ పంచాయతీల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో స్థానిక ఈర్ల గంగమ్మ సన్నిధానం వద్ద శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో చైతన్య మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రతో ప్రజల కష్టాలు తెలుసుకుని రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చినమాటకు కట్టుబడి సంక్షేమ అభివృద్ధి పథకాలతో నెంబర్‌వన్ సీఎంగా జగనన్న ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు అధికార దాహంతో అవాకులు, చవాకులు పేలుతున్నారని, బాబుకు ఎల్లో మీడియా వత్తాసు పలుకుతుందని చైతన్య విమర్శించారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని గృహసారథులు, కన్వీనర్లు 14 నెలల పాటు కష్టించి పనిచెయ్యాలన్నారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి, మండల సచివాలయ కన్వీనర్ టి. నరేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా సునీత ఎంపికపై హర్షం



స్వీట్లు పంచుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**చీరాల అర్బన్:** పోతుల సునీతను ఎమ్మెల్సీగా రెండోసారి అవకాశం కల్పించినందుకు సోమవారం ఆమె వర్గీయులు మల్లెల బుల్లిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గడియార స్తంభం సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీగా రెండోసారి అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

### వ్యక్తిపై కత్తితో దాడి

**మేదరమెట్ల:** పొలం విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఓవ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈఘటన కుర్రావానిపాలెంలో ఆదివారం జరగ్గా సోమవారం ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. పొలం పనులు విషయమై నాదెండ్ల సూర్యనారాయణ రావు ఎస్సీ కాలనీలోకి వెళ్లగా కట్టా వెంకటేష్ తాగి కత్తితో తన కుమారుడిని పొడిచినట్లు తండ్రి యతిరాజులు ఫిర్యాదులో పేర్కొనట్లు చెప్పారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న క్షతగాత్రుడి తండ్రి యతిరాజులు 108 ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.